## మహాశివరాత్రి ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం

బద్వేలు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

ఫిబ్రవరి 15న జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని శైవక్షేత్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చంద్రమోహన్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రితేష్ కుమార్ రెడ్డిల అధ్యక్షతన ఆర్డీఓ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు అవసరమైన భద్రత, తాగునీరు, విద్యుత్, రవాణా, పారిశుధ్యం తదితర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.




ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 06 ఫిబ్రవరి 2026

## సర్వ పాపహరణం లక్షకుంకుమార్చనం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



కుంకుమార్చనందుకొంటున్న అమ్మవారు

అమ్మవారికి ప్రీతిపాత్రమైన లక్ష కుంకుమార్చనలో పాల్గొంటే సర్వపాపాలు తొలుగుతాయని వేదపండితులు అన్నారు. శక్తిక్షేత్రం బోయకొండపై గురువవారం రెండవరోజు లక్షకుంకుమార్చనను 108మంది దంపతుల నడుమ జరిగింది. ప్రధాన ఆలయాల్లోని అమ్మవార్లకు నిర్వహించిన పుష్పాలంకరణ భక్తులను ముగ్దులను చేసింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, పుష్పాలంకరణగావించారు. ఆవరణంలో ఉత్సవ విగ్రహాన్ని వుంచి ఎదురుగా దంపతుల సమక్షంలో వేదపండితులు లక్షకుంకుమార్చన చేయించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమాది కార్యక్రమాలు భక్తులను అలరించాయి. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు ఉచిత అన్నప్రసాదమందించారు. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ మ్యుటేషన్‌ల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

### రీసర్వేలో జాయింట్ ఎల్పీఎంలు తక్కువుగా ఉండేలా చూడాలి... జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :

రెవెన్యూ మ్యుటేషన్‌ల అర్జీలను క్షేత్రస్థాయిలో వివరణాత్మకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రమైన మదనపల్లెలో ఓ ప్రైవేటు పంక్షన్‌లో జిల్లాలోని అన్ని గ్రామాల విఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు, అన్ని మండలాల డిప్యూటి తహశీల్దార్లు, తహశీల్దార్లకు భూముల మ్యుటేషన్‌లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రీ సర్వే కార్యక్రమంలో జాయింట్ ఎల్పీఎంలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజలు సమర్పించే మ్యుటేషన్‌ల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులతో ఫోటో తీసుకొని పక్కాగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గ్రామాల వారీగా మ్యుటేషన్‌లకు సంబంధించి రిజిష్టర్‌లను నిర్వహించాలన్నారు. మ్యుటేషన్‌లను తిరస్కరిస్తే ఎందుకు తిరష్కరించామో స్పష్టమైన కారణాలతో స్పికి ఆర్డర్ ఇవ్వాలని, తిరష్కరణకు సంబంధించి వివరాలను రిజిస్టర్‌లో, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్‌లు ఆమోదిస్తే అర్జీదారుల చట్టపరమైన వారసుల వివరాలను, అమ్మకపు పత్రాలను, కుటుంబ వివరాలను పక్కాగా చూసి సరిదిద్దాలన్నారు. అక్రమ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు ఉంటే నిర్ణయిత కాల వ్యవధిలో తప్పులు సరిచేసి నూతన పట్టాదారు పాసుపుస్తకాన్ని అర్జీదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో జరిగబోయే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నిర్ణయిత కాల వ్యవధిలో పూర్తి కావాలని ఆదేశించారు. అర్జీలను ఏ విధంగాపరిష్కరించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, జిల్లా ల్యాండ్ సెక్షన్ సూపర్ వైజర్ శ్రావణి రెవెన్యూ సిబ్బందికి వివరించారు. మ్యుటేషన్‌ల పరిష్కారంలో తప్పులు ఏ విధంగా సరిదిద్దాలి అనే అంశాలను వివరించారు. ఫారం-8 నోటీస్ జారి చేసి విఆర్ఓల ద్వారా క్షేత్రస్థాయి విచారణ, సబ్‌కలెక్టర్ లేదా ఆర్డీఓ స్థాయిలో పరిశీలన అనంతరం తుది ఆమోదం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ, సబ్‌కలెక్టర్ కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్‌రావు, రాయచోటి, పీలేరు ఆర్డీఓ శ్రీనివాస్, సర్వేశాఖ ఏడి భరత్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




## ఎల్ఎస్‌పీ చైర్మన్‌ను సన్మానించిన సీఎం

: పలు సమస్యలను సీఎంకు వివరించిన చైర్మన్

: సానుకూలంగా స్పందించిన సీఎం

బద్వేలు ,ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



నీటి సంఘాల సమావేశంలో ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్మానించారు. విజయవాడలో జరిగిన నీటి సంఘాల సమావేశంలో ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్చార్జి రితేష్‌రెడ్డి సూచనల మేరకు బద్వేలు పరిసర ప్రాంతాలలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందిస్తూ చెరువుల మరమ్మతులకు నామినేటెడ్ కింద 5 నుంచి 10 లక్షల వరకు ఎలాంటి జీఎస్టీ లేకుండా పనులు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామని, దీని ద్వారా పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ఇబ్బంది జరగకుండా ఉంటుందన్నారు. ఇప్పటికే కొన్ని చెరువుల నామినేటెడ్ కింద పనులు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని కాకపోతే గతంలో జీఎస్టీ ఉండేదని ఇకపై జీఎస్టీ లేకుండా చేస్తామని హామి ఇచ్చారు. రైతులు వరిపంటను తగ్గించి, ఇతర పంటలపై దృష్టి పెట్టాలని సీఎం వివరించారు. వరిపంటల కన్నా మిల్లెట్ పంటలైన రాగి, జొన్న, సొద్ద లాంటి ఇతర పంటలపై దృష్టిపెట్టాలన్నారు. సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బద్వేలుతో పాటు గోపవరం, అట్లూరు మండలాలకు నీరు అందించే ప్రక్రియ వేగవంతం చేయాలని ఈగ వెంకటరమణారెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. గత మన ప్రభుత్వంలో సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ జీవోను విడుదల చేశారని, అయితే ఆ అంశాన్ని తర్వాత పక్కన పెట్టడం జరిగిందని ఇప్పుడు వేగవంతం చేసి లిఫ్ట్ రిగేషన్ ద్వారా నీరు అందిస్తే ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతూ నిరంతరాయంగా పంటలు పండించుకునే అవకాశం ఉన్నందున లిఫ్ట్ ఇరిగేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలని చైర్మన్ వెంకటరమణారెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. త్వరగా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

## మూలపల్లిలో భూ కబ్జా.. జెసిబి, ఇటాచ్చి, ట్రిప్పర్లు సీజ్..

కాశినాయన 05 ప్రభాతవార్త



మండలం మిద్దెల గ్రామ పంచాయతీ పరిధిలోని మూలపల్లి పొలంలో సర్వేనెంబర్1లో వందల ఎకరాల్లో పట్టపగలే జరుగుతున్న భూకబ్జాపై బద్వేలు ఆర్డిఓ చంద్రమోహన్ దాడులు చేశారు. మూలపల్లి పొలంలో సర్వే నెంబర్ 1లో 1018 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 400 ఎకరాలు అటవీశాఖ కు అప్పగించారు. మిగిలిన 600 ఎకరాల భూమిలో మిద్దెల గ్రామానికి చెందిన ఎస్సిలకు,ఇతరులకు200ఎకరాలకు అసైన్ మెంట్ కమిటీలో ఒక్కొక్కరికి ఒక ఎకరా చొప్పున భూమిపంపిణీ చేసి పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత మిగిలిన 400 ఎకరాల భూమి కి పదవి విరమణ చేసిన, చనిపోయిన తహశీల్దార్ పేరుతో 1500 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమణ తెరలేపారు. ఇందులో కొసమెరుపు ఏమంటే అసైన్ మెంట్ కమిటీలో ఆమోదించి పట్టాలు పొందిన లబ్ధిదారులను సైతం పేక్ గాళ్ళు భూముల్లోకి రానీయకుండా అడ్డుకొని, ఆన్‌లైన్ కూడా ఎక్కించు కున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పట్టపలగలే బహిరంగంగా జెసిబిలు, ఇటాచ్చిలు, డౌజర్లు, ట్రిప్పర్లు పెట్టి అక్రమార్కులు భూములు చదును చేస్తున్నారని వచ్చిన పిర్యాదులపై హుటాహుటిన మూలపల్లి పొలాల్లోకి బద్వేలు ఆర్డిఓ చంద్ర మోహన్, కాశినాయన మండల తహశీల్దార్ వెంకటసుబ్బయ్య పోరుమామిళ్ల సీఐ హేమ సుందర్ రావు, రెవెన్యూ, పోలీసుసిబ్బందితో వెళ్తుండగా వ్యక్తీ అక్రమార్కులకు అండదండలు అందించారని, జేసిబిలు ఇటాచ్చిలు, టిప్పర్లతో ముళ్ళపొదలు ఒకప్రక్క తొలగిస్తుండగా మరొక ప్రక్క కుంటలోని మట్టిని తెచ్చి చదును చేయిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆర్డిఓ వాహనాలు చూసిన అక్రమార్కులు పరుగులు తీశారు. కొన్నిజేసిబిలు,ఇటాచ్చిలు తప్పించుకొని పారిపోగా, రెండుఇటాచ్చిలు, ఒకజెసిబి, ట్రిప్పర్ పట్టుకొని సీజ్ చేశారు. అక్కడే డ్రోన్‌తో పారిపోయిన దొంగలను గుర్తించే పనిచేశారు. బద్వేలుఆర్డిఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గత రెండు మూడు రోజుల క్రితంసెలవులు పెట్టి మూలపల్లి గ్రామ రెవెన్యూపొలంలో జరుగుతున్న భూకబ్జాలో ఉన్నట్లు, జేసిబిలతో ముళ్ళపొదలు తీయిస్తున్నట్లు. భూముల్లోకి వచ్చిన ఆర్డిఓకు తన కార్యాలయ ఉద్యోగి హస్తం ప్రధానంగా ఉండటంతో విస్తుపోయారు. పట్టాలు కలిగిన వారందరు గతంలో కాశినాయన పోలీసుస్టేషన్లో పిర్యాదు చేశామని, కానీ వారిపై చర్యలు కనిపించకపోవడంతో బహిరంగంగా పట్టపగలే ఆక్రమణలకు తీయలేపారని, మొదట వారిపై చర్యలు తీసుకోని ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేదికాదని భాదితులు మండిపడ్డారు. సమగ్ర నివేదికను రెండు రోజుల్లోఇవ్వాలని తహశీల్దార్ వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపల్లిభూముల్లో ఆక్రమణ కు పాల్పడిన వారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదన్నారు. సీజ్ చేసిన వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేస్తామన్నారు.

## త్రాగు నీటి కోసం గలమెత్తిన ప్రజలు



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 10,1,12,13, వార్డులలో శుద్ధి చేసిన త్రాగునీటిని అందించాలని ఆ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఇర్ఫాన్ భాష ఆధ్వర్యంలో గలమెత్తారు. గురువారం స్థానిక కోనేటి కాలువ వీధిలోని నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి పైపులైన్లను కొత్తవి ఏర్పాటు చేసి తమకు శుద్ధి చేసిన నీటిని అందించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఇర్ఫాన్ బాషా మీడియాతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో నూతన పైప్ లైన్స్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిస్థితి మారిందన్నారు. రెండో మైసూర్‌గా పేరుపొందిన ప్రొద్దుటూరు ప్రజలకు మాత్రం శుద్ధమైన తాగునీరు అందక, మురికి నీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో తాగునీటి సమస్య ఎన్నేళ్లుగా కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. పాత పైప్‌లైన్‌లు పూర్తిగా తుప్పు పట్టి, కాల్వల నీరు పైపుల్లోకి చేరడంతో ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోందన్నారు. ముఖ్యంగా చౌడేశ్వరి నగర్ నుంచి గంగమ్మ దేవళం వీధి వరకు నాలుగు వార్డులకు తాగునీటి కనెక్టివిటీ ఉండగా, 10, 11, 12, 13 వార్డులకు ప్రధాన పైప్ లైన్ పూర్తిగా పాడైపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే పరిస్థితిని ప్రభుత్వం తక్షణమే సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత పైప్‌లైన్‌లను వెంటనే తొలగించి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి శుద్ధమైన తాగునీరు అందించేవరకు తాము ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరీ ఎల్లయ్య, ఖాలందర్, మైనారిటీ నాయకులు షేక్ మోలాలి, గౌస్, నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్ చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

### బిజెపి పార్లమెంటు అధ్యక్షుడు సాయి లోకేష్

రాజంపేట, ఫిబ్రవరి5 ప్రభాతవార్త :

డైవర్షన్ పాలిటిక్స్ చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని , ఈ విషయంలో ఆయనను మించిన నాయకుడు ఎవరూ లేరని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సాయి లోకేష్ కుమార్ విమర్శించారు. గురువారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువులకు పరమ పవిత్ర దేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కల్తీ చేసి హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ కొట్టిన జగన్కు శ్రీవారు తగిన రీతిలో బుద్ధి చెప్పి ఇంటికి పరిమితం చేశారన్నారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి పరమ పవిత్రమైన లడ్డును అపవిత్రం చేసి అది కప్పిపుచ్చుకోవడానికి నానా యాగి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కల్తీ లడ్డు విషయమై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా అది కల్తీ జరగలేదని జగన్ ఎలా చెప్పుతున్నారన్నారు. సిట్ తన ప్రాథమిక నివేదికలో లడ్డు ప్రసాదం కల్తీ జరిగిందని నివేదికను తెలియజేస్తే అందులో జంతువుల కొవ్వే లేదని అసలు, కల్తీనే జరగలేదని పేర్కొంటూ రాజకీయ విలువ లేని అంబటి రాంబాబు లాంటి వారి చేత తప్పుడు ప్రచారం చేయించారని మండిపడ్డారు. రాజకీయం కోసం రాష్ట్రాన్ని అగ్నిగుండం చేయాలని ,ఈ కల్తీ లడ్డును మర్చిపోవడానికి రాష్ట్రం రావణ కాష్టం చేస్తూ కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై లేనిపోని ఆరోపణలు చేస్తూ అలజడులు లేపాలని చూస్తున్నారని విరుచుకుపడ్డారు.అటు పార్లమెంటులోనూ ఇటు రాష్ట్రంలోనూ అశాంతిని సృష్టిస్తున్న జగన్ను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు. ఇప్పటికే 11 సీట్లకే పరిమితమై సిగ్గుతో అసెంబ్లీకే రాలేకపోతున్న జగన్ ఇంకా ప్రజలను మోసగించడానికి తన కల్తీ లడ్డు విషయాన్ని మర్చిపోవడానికి ఏదేదో డై డైవర్షన్ పాలిటిక్స్ చేసినంత మాత్రాన ప్రజలు ఎవ్వరూ నమ్మరన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను స్వాగతించి సద్విమర్శలు చేసి అసెంబ్లీలో ప్రజల సమస్యలను ప్రస్తావించి ప్రజా పోరాటాలు నిర్వహించాలి తప్ప ఇలాంటి చౌకు బారు ఆందోళనలు చేసినంత మాత్రాన ఉపయోగం లేదని తెలిపారు. విలువలు లేని అంబటి రాంబాబు లాంటి నాయకులను అడ్డుపెట్టుకొని కాపు లపై ఏదో జరుగుతున్నట్లు చెప్పినంత మాత్రాన కాపులు నమ్మ రన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు తోట శ్రీనివాసులు, కంబాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పుంగనూరులో పర్యటించిన షర్మిల



పుంగనూరు రూరల్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:

ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల గురువారం పుంగనూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నో కీలక పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకం విజయాన్ని చూసేందుకు అమెరికా వంటి దేశాలు కూడా వచ్చాయని తెలిపారు. ఈ పథకం వల్ల గ్రామీణ పేదలకు ఉపాధి లభించి జీవనోపాధి మెరుగుపడిందన్నారు. రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక పీజీలు, డిగ్రీలు చేసిన వారు డ్రైవర్లుగా మారుతున్న పరిస్థితి బాధాకరమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ కోసం కేటాయించే రూ.86 వేల కోట్లు నేరుగా పేదలకే చేరే నిధులని, అందుకే బీజేపీ ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరు ఉన్న ఈ పథకాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

## మద్యంమత్తులో ఉన్న వారి
# సొత్తు దోపిడీ

- నేరం జరిగిన 2 రోజుల్లో దొంగ అరెస్ట్
- బంగారు వస్తువులు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

మద్యం మత్తులో ఉన్న వారే లక్ష్యంగా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడిన కరుడుగట్టిన దొంగను ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే గత నెల 29న ప్రొద్దుటూరు టౌన్‌లోని హోమస్‌పేటలో ఒక మద్యం షాపు వద్ద ప్రొద్దుటూరు టౌన్ మేదరవీధికి చెందిన టంగుటూరు ఎల్లాలు(40) మద్యం సేవించి మత్తులో ఉండి అటుగా వస్తున్న ఒక వ్యక్తిని తన స్కూటీపై ఎక్కించుకొని ఒక పథకం ప్రకారం టౌన్ శివార్లలోని పూజ ఇంటర్నేషనల్ స్కూలు సమీపానికి తీసుకెళ్లి అతని ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, 2 ఉంగరాలు దోచుకొని అతన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఆ మరుసటి రోజు ఉదయం మద్యం మత్తు వదిలిన బాధితుడు బంగారు వస్తువులు చోరీ విషయమై ఫిర్యాదు చేశాడు. ప్రొద్దుటూరు ఏఎస్పీ యు.విభూకృష్ణ ఆదేశాలతో రూరల్ సీఐ నాగభూషణ్ నేతృత్వంలో ప్రొద్దుటూరు రూరల్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని ఒక ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో రెండు రోజుల్లోనే ప్రొద్దుటూరు టౌన్‌లోని దస్తగిరిపేటకు చెందిన పాత నేరస్తుడైన జెస్టది రాజేష్(25)గా గుర్తించి గురువారం అరెస్టు చేయడం జరిగింది. అతని వద్ద నుంచి 20 గ్రాములు బంగారు గొలుసు, 2 ఉంగరాలతో పాటు నేరానికి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కేసు నమోదు అయిన 2 రోజుల్లోనే నిందితున్ని అరెస్టు చేసినందుకు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. అపరిచితుల లిఫ్ట్ తీసుకోవద్దని, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.



## పాత కక్షలతో వ్యక్తిపై దాడి

మదనపల్లి క్రైమ్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.

పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటన కురబలకోట మండలం తుమ్మ చెట్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. కురబలకోట మండలం తుమ్మ చెట్లపల్లికి సురేంద్ర (57) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. సురేంద్రకు, అదే గ్రామానికి చెందిన బూట్స్ రమణ కుటుంబానికి పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి సురేంద్ర రమణ ఇంటి ముందు నడిచి వెళ్తుండగా బూడ్స్ రమణ, అతని కుటుంబ సభ్యులు శాంతమ్మ, రమణమ్మ, రమణ కుమారులు మహేంద్ర, మహేష్, మైత్రిలు అడ్డగించి కర్రలు, ఇనుపరాడ్లు తో దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో సురేంద్రకు గాయాలు కావడంతో స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బోరెడ్డిగారిపల్లిలో ప్రజాదర్బార్

చిన్నమండెం పిబ్రవరి 5 ప్రబాతవార్త:

మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో గురువారం మంత్రి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.



## మదనపల్లెలో ఏసీబీ దాడుల కలకలం

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.



మదనపల్లెలో ఏసీబీ అధికారులు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఓ అధికారి ఇంట్లో జరిపిన దాడులు తీవ్ర కలకలం రేపాయి. దాడులకు సంబంధించి కడప ఏసీబీ సీఐ నాగరాజు మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న మేజారి సుబ్బయ్య సదరం సర్టిఫికెట్ల జారీలో ఓ బాధితుని దగ్గర రూ.30వేలు లంచం తీసుకుంటూ బుధవారం పట్టుబడినట్లు జరిగిందన్నారు. కడప ఏసీబీ డీఎస్పీ సీతారామారావు ఆదేశాలతో అనంతపురం ఏసీబీ టీమ్ తో కలసి మదనపల్లె బీకేపల్లెలో ఉంటున్న మేజారి సుబ్బయ్య ఇంట్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. అయితే ఎలాంటి అక్రమ ఆస్తులు వెలుగుచూడలేదని కొని అనుమానిత రికార్డులను వెంట తీసుకుని వెళ్లామన్నారు. ఏసీబీ అధికారుల దాడుల వార్త పట్టణంలో దావానంలా వ్యాపించడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగులు తీశాయి.

## పాత కక్షలతో వ్యక్తిపై దాడి

## కౌండిన్య నదిలో పేరుకుపోయిన చెత్త

పుంగనూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:

పట్టణంలోని కౌండిన్య నది ప్రస్తుతం చెట్లు, చెత్తతో నిండిపోయి ఉంది. పుంగమ్మ చెరువు నుంచి దిగువ ప్రాంతాల చెరువులకు నీరు వెళ్లే ప్రధాన మార్గంగా ఉన్న ఈ ప్రవాహం చెట్లు పేరుకుపోయిన కారణంగా పెద్ద ఎత్తున అడ్డంకులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రివర్ మొత్తం మీద చెట్లు పడిపోవడం, ప్లాస్టిక్ చెత్తతో పాటు జమ్ము గడ్డి విస్తరించడం వల్ల నీటి ప్రవాహం పూర్తిగా అడ్డుకుపోయే పరిస్థితి నెలకొంది. ఇటీవల పుంగమ్మ చెరువుకు హంద్రీనీవా జలాలు చేరడంతో రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొద్ది రోజులలోనే మరవ ద్వారా నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితిలో కౌండిన్ రివర్‌లో ఉన్న అడ్డంకులు పెద్ద సమస్యగా మారే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి ప్రవాహం సాఫీగా సాగకపోతే చెరువులు నిండకపోవడం, వరద ముప్పు ఏర్పడటం వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. మినీ బైపాస్ తాటిమాకుల పాళ్యం ప్రాంతం నుంచి చివరి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో, రివర్‌ను పూర్తిగా శుభ్రం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి కౌండిన్ రివర్‌లో పేరుకుపోయిన చెట్లు, చెత్తను తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అంగన్వాడీ, రేషన్ షాపులు, సంక్షేమ వసతి గృహాలు తనిఖీ

### ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి

సిద్దవటం ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:




మండలంలోని అంగన్వాడీ, రేషన్ షాపులు, సంక్షేమ వసతి గృహాలు తనిఖీ చేసినట్లు ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. సిద్దవటం దిగువపేట రేషన్ షాపు తనిఖీల కోసం వెళ్లిన సమయంలో రేషన్ డీలర్ షాపు మూసి వెళ్లడం దురదృష్టకరమని ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన సిద్దవటం మండలంలోని పలు ప్రాంతాల్లో అంగన్వాడీ, రేషన్ షాపులు, సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రేషన్ షాపుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దవటంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఆయన హాస్టల్ లోని భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారని విద్యార్థులు తెలపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో, పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం తప్పనిసరిగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రతి పాఠశాలలో పిల్లలకు ఎంత పరిమాణంలో భోజనం అందించాలన్న వివరా లతో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. పథకాల అమలులో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆయన భాకరాపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను మాధవరం1 గ్రామ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సిద్దవటం తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ లు ఉన్నారు.అంగన్వాడీ కేంద్రాలు తనిఖీ సిద్ధవటం మండలం మాధవరం1 పరిధిలోని వెంకటేశ్వరపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలో అందిస్తున్న పోషకాహారం నాణ్యత, పిల్లల హాజరు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆయన ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి, సూపర్వైజర్ శ్రీవిద్యలు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ ఢీకొని వృద్ధురాలు మృతి

**దువ్వూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ ఢీ కొని జేష్ఠాది సుజానమ్మ(80) అనే వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. దువ్వూరు క్రిస్టియన్ వాడకు చెందిన సుజానమ్మ బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా దువ్వూరు నుండి గుడిపాడుకు పోవు మోటార్ సైకిల్ పై వెళ్లే వ్యక్తి ఢీ కొనగా ఆమెకు గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందింది. ఈ మేరకు దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మహిళల రక్షణే లక్ష్యంగా కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

**కడప క్రైం, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**



వైఎస్ఆర్ కడప జిల్లా ఎ స్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మహిళా భద్రత స్పెషల్ డ్రైవ్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, కాలనీలు, పాఠశాలలు, పట్టణ ప్రాంతాల్లో పోలీసు అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు గురువారం గ్రామాలు, కాలనీలు సందర్శించి మహిళలు, బాలికలు, యువతులతో ముఖాముఖి మాట్లాడి వారి భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ, గౌరవం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని ముఖ్యమైన చట్టాలు, శిక్షల వివరాలు, వాటి ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. డయల్ 112(అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ), గృహహింస 181, మహిళల వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల భద్రత పరిరక్షణలో పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ఫుట్ పెట్రోలింగ్

**కడప క్రైం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు సూచనల మేరకు కడప టుటౌన్ పరిధిలోని రోడ్డులకు ఇరు వైపులా వాహనాలు పర్కింగ్ చేసి రాకపోకలు ఇబ్బందులు లేకుండా సీఐ జి.ప్రసాదరావు మరియు సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ చేశారు. ట్రాఫిక్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులఉు లేకుండా వాహనాలు తొలగించడం జరిగింది. మోటారు వాహనాల చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రసాదరావు హెచ్చరించారు.

## రైసింగ్ స్టార్-2026 మెరిటోరియస్ అవార్డులు

**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో రైసింగ్ స్టార్-2026 మెరిటోరియస్ అవార్డులను పీలేరు సి ఎ న్ ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అందుకున్నారని కళాశాల కరస్పాండెంట్ చింతల విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ ఎస్.వి. యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం జరిగిన "రైసింగ్ స్టార్-2026" మెరిటోరియస్ అవార్డుల కార్యక్రమంలో, పీలేరు పట్టణానికి చెందిన సి.ఎన్.ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరచి విశ్వవిద్యాలయ స్థాయి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. లావణ్య, అధ్యాపక బృందం అవార్డు గ్రహీతలను అభినందిస్తూ, వారి విజయం, క్రమశిక్షణ, కష్టపడి చదవడం, అధ్యాపకుల మార్గదర్శకత్వం ఫలితమని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను వారు అందుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు రెండు చోట్ల యూరియా పంపిణీ

**దువ్వూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రెండు రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం 30టన్నుల యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. గుడిపాడు, చల్లబసాయి పల్లె రైతు సేవా కేంద్రాల్లో యూనియన్ పంపిణీ చేస్తున్నామని వీటికి సంబంధించి కటిక పల్లె, మనెరాం పల్లె గ్రామాల రైతులు ఈ రెండు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి యూరియాని కొనుగోలు చేయవచ్చు అన్నారు. రైతులు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని వెల్లాలని, ప్రతి రైతుకు మూడు బస్తాల యూరియా అందజేస్తామన్నారు. మొత్తం 600 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని శవం లభ్యం..

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 05 ప్రభాతవార్త**



బ్రహ్మంగారిమఠం మండలం,జౌకుపల్లె గ్రామము వద్ద గల తెలుగుగంగ కాలువ నందు గుర్తు తెలియని శవం లభ్యమైనట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. గుర్తు తెలియని శవం కు సుమారు 30 సంవత్సరాలు ఇతని వివరాలు తెలిసిన యడల బ్రహ్మంగారిమఠంసబ్ ఇన్స్పెక్టర్ 9121100624 మైదుకూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ 9121100621 ఈ క్రింది నెంబర్ లకు తెలపగలరు.

## క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన..

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 05 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని గోవిందమాంబ బాలికల పాఠశాల యందు గురువారం స్థానిక పిహెచ్సి వైద్యాధికారి సంపత్ కుమార్ క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ఏ విధంగా వస్తుంది,ఈ వ్యాధి రాకుండా ఏ విధంగా మనం ముందు జాగ్రత్తలు తీసుకోవాలి,క్యాన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాలి,క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**
22వ తేదీన జరగనున్న బీసీ సింహ గర్జన మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కడపలో బీసీవై నూతన కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 22వ తేదీ మధ్యాహ్నం 2 గం.లకు నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో బీసీల ఐక్యత, ఆత్మగౌరవం, హక్కుల సాధన లక్ష్యంగా జరగనున్న బీసీ సింహ గర్జన మహాసభకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున బీసీ బిడ్డలు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీవై పార్టీ అధినేత రామ చంద్ర యాదవ్ బీసీల సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్నారన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీవై స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ సుబ్బారావు, కడప జిల్లా యూత్ లీడర్ నాగార్జున, పులివెందుల కన్వీనర్ నిర్మల, సోషల్ మీడియా కన్వీనర్ సురేష్, మీడియాలో తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాల ఉచిత పంపిణి

**వేంపల్లి:ఫిబ్రవరి 05(ప్రభాత వార్త)**



మండలం లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కు ఉచితంగా కంటి అద్దాలు పంపిణి చేశారు. జాతీయ అందత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా వేంపల్లి మండలంలోని అన్ని హైస్కూలలో గతంలో పరీక్షించి లోపాలు ఉన్న విద్యార్థినీ విద్యార్థులకు కంటి డాక్టర్ రెడ్డన్న గారి ఆధ్వర్యంలో శిబిది తాళ్లపల్లి సిబ్బంది సహకారంతో ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగింది.

## ఆలయాల్లో హుండీల లెక్కింపు

**వేంపల్లె ఫిబ్రవరి 05 (ప్రభాత వార్త)**



శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయము లందు గురువారం హుండీల లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సుభాష్ తెలిపారు. 10 నెలలకు గాను సదరు హుండీల లెక్కింపు ద్వారా శ్రీ వృషభాచలేశ్వర స్వామి ( ఎద్దుల కొండపైన) ఆలయం నందు రూ.1,46,303/ లు, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నందు రూ. 52,892/ లు మరియు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు రూ2, 27,449 రూపాయలు, మూడు ఆలయముల ద్వారా మొత్తము రూ.4,26,644/ లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సదరు హుండీల లెక్కింపు కార్యక్రమం నందు దేవదాయ శాఖ పొద్దుటూరు డివిజన్ తనిఖీ దారులు ఏ కిరణ్ కుమార్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ పివి రమణ, సభ్యులు అద్దంకి రామయ్య, జూటూరు జ్యోతి, రాజమ్మ, దేవస్థానం ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్, అర్చకులు తిరుమల వేణు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు జి. రామకృష్ణ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాయలసీమపై వైకాపాది కపట ప్రేమ

**వేంపల్లె ఫిబ్రవరి 05 (ప్రభాత వార్త)**



వైకాపా నాయకులు, జగన్మోహన్ రెడ్డి రాయలసీమపై మొసలి కన్నీరు కార్చడం, కపట ప్రేమ ప్రదర్శించడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పోతిరెడ్డిపాడు వద్ద రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలంటూ వైకాపా నాయకులు నిరసన సభ జరపడం విడ్డూరమన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడే, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ 2021 జూలై 7న స్టే ఉత్తర్వులు ఇచ్చింది. తర్వాత వైకాపా మూడు సంవత్సరాలు అధికారంలో ఉంది. ఈ మూడు సంవత్సరాలలో స్టే వెకేట్ చేయించి,అనుమతులు తెప్పించి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో జగన్మోహన్ రెడ్డి, వైకాపా నాయకులు రాయలసీమ ప్రజలకు చెప్పాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

## తిరుమల లడ్డులో అసలు నెయ్యే లేదు

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



వైఎస్సార్సీపీ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, లడ్డు తయారీలో అసలు నెయ్యే వాడకుండా రసాయనాలతో మభ్యపెట్టారని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ విమర్శించారు. గురువారం మదనపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వైఎస్సార్సీపీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ గతంలో వివేకానంద రెడ్డి మరణంపై ఎలాగైతే అబద్ధపు ప్రచారం చేశారో, ఇప్పుడు లడ్డు విషయంలోనూ అదే తరహాలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ పాపానికి పరిహారంగా వైఎస్సార్సీపీ నాయకులు తమ తప్పును ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సందీప్ రెడ్డి, ఎస్టేట్ రమణ, రాజా, జగదీష్, మహిళా నాయకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## రమేష్‌ను హత్య చేసిన వారిని శిక్షించాలి

**రాయచోటి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



టిఎం రమేష్‌ను హత్య చేసిన వారిని శిక్షించాలి అని"MRPS జాతీయ నాయకులు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నూలు జిల్లా దుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామ నివాసి మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు టి ఎం రమేష్ గారిని కొంతమంది 31/1/2026 సాయంత్రం వెనకవైపు నుంచి ట్రాక్టర్ తో గుద్దించి తలపై రాళ్లతో మోది హత్యచేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించాడు. ఈ విషయమై ప్రజాసంఘాలు కూడా ఖండిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలలో భాగంగా ఈ రోజు రాయచోటి పట్టణం తహసిల్దార్ ఆఫీస్ ప్రక్కన అంబేద్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ దుర్మార్గం పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ముద్దాయిలకు త్వరలో శిక్ష పడే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేసి విచారణ చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అశోక్ బాస్ నాయకులు తాతయ్య బీఎస్పీ నాయకులు నాగేశ్వర్ బిఆర్ఎస్ నాయకులు కదరయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్ విద్యావంతుల వేదిక జీవానందం చల్లారెడ్డయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు సుబ్బయ్య నాగయ్య రవి మోహన్ రమణ చంద్రయ్య ఐ సా నాయకులు సాయి ప్రజాసంఘాల నాయకులు పా మయ్య వెంకటరమణపెంచలయ్య సురేంద్ర, విజురమణ మరియు దళిత నాయకులు పాల్గొన్నారు.

## విద్యాంజలి 2.0 ను ప్రతి పాఠశాల నమోదు చేసుకోవాలి

**కేవీ పల్లె ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛంద సంస్థల, కార్పొరేట్ సంస్థలు,ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన విద్యాంజలి 2.0 కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ పాఠశాల తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారులు పి.రెడ్డి భాషా, డి సుబ్రమణ్యం రెడ్డిలు తెలియజేశారు. గురువారం మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యాంజలి రిజిస్ట్రేషన్‌లపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లు మరియు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు హాజరయ్యారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యాంజలి పోర్టల్‌లో క్రమం తప్పకుండా తమ అవసరాలను నమోదు చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ ఆర్. సుబ్రమణ్యం విద్యాంజలి లో పాఠశాలలు ఎలా రిజిస్టరు కావాలో తెలుపుతూ స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని, విద్యాంజలి ద్వారా ప్రభుత్వ పాఠశాలల మౌలిక అవసరాలు తీర్చే అవకాశం ఉందని తెలిపారు. విద్యాంజలి పూర్తిగా స్వచ్ఛందంగా పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు , మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీను నాయక్, అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ,తదితరులు పాల్గొన్నారు.

## సెరికల్చర్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

**పులివెందుల, ఫిబ్రవరి 5 , ప్రభాత వార్త :**
పట్టు పరిశ్రమను కుటీర పరిశ్రమగా విస్తృతంగా అభివృద్ధి చేస్తే దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చని పులివెందుల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కళాశాల ప్రాంగణంలో సెరికల్చర్ సర్టిఫికెట్ కోర్సు ను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే రంగాల్లో పట్టు పరిశ్రమ ముఖ్యమైనదని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అవకాశాలు సెరికల్చర్ రంగంలో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ఈ కోర్సు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్బరీ సాగు పద్ధతులు, పట్టుపురుగుల వివిధ జాతులు, వాటి పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టు ఉత్పత్తి ప్రక్రియ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందడం ద్వారా కోర్సు పూర్తి చేసిన అనంతరం స్వయంగా సెరికల్చర్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని సూచించారు.ఈ కోర్సు ద్వారా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు ఉపాధి అవకాశాలు పొందగలరని, భవిష్యత్తులో పట్టు పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్ర మంలో కళాశాల అధ్యాప కులు, సెరికల్చర్ నిపుణులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాల నమోదు తప్పనిసరి

**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రవేశపెట్టిన విద్యాంజలి కార్యక్రమంలో ప్రతి పాఠశాల నమోదు తప్పనిసరిగా కావాలని మదనపల్లి ఇంచార్జ్ డివైఈవో, పీలేరు మండల విద్యాశాఖ అధికారి వై. లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం పీలేరు జిల్లాపరిషత్తు బాలికోన్నత పాఠశాల (అయ్యప్ప రెడ్డి కాలనీ) లో మండల విద్యాశాఖ అధికారిణి బి. పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన విద్యాంజలి2.0 కార్యక్రమం పై మండల స్థాయి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి వై లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు అవసరమైన వందకు పైగా సేవలను విద్యాంజలి2.0 వెబ్‌సైట్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేయడం ద్వారా దేశంలోని ప్రముఖ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాల అవసరాలను తీర్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యాంజలి పోర్టల్‌లో క్రమం తప్పకుండా తమ అవసరాలను నమోదు చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వర రెడ్డి, అన్నమయ్య జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ గంగాధరం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమరాణి, రెడ్డప్ప, సురేంద్ర, నాగరత్నమ్మ, పార్వతమ్మ రేణుక జైపాల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, రిసోర్స్ పర్సన్లు ఎస్. వేణుగోపాల్, సి.ఆర్.పి లు జలకనూరి మురళీధర్ రాజు, అశోక్, మాధవి, శ్వేత, స్వచ్ఛంద సంస్థల అధినేతలు రాజమ్మ, యోగా లక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాల కరపత్రాలు విడుదల

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 5 ప్రభాత వార్త**



ప్రొద్దుటూరు, ఆలయ కార్యనిర్వహణాధికారి కే.వీ రమణ , ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి గురువారం వారు ఈ విషయమై పాలకమండలి సభ్యులు, అర్చకులతో కలిసి శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవములలో భాగంగా తెల్లవారు జామున 3 గంటలకు స్వామివారి సుప్రభాత సేవతో ప్రారంభమై స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, 6 గంటలకు రుద్ర హోమం, 10 గంటలకు స్వామి అమ్మవార్ల కళ్యాణం, మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు భరతనాట్యం, 7 గంటలకు స్వామి అమ్మవార్ల గ్రామోత్సవము, 9 గంటలకు కోలాటం, 10 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగోద్భవ సమయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయని వివరించారు. కావున భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

## బాలికలకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**కలసపాడు, జనవరి 5 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పెండ్లమర్రి సమీపంలో గల కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి , ఇంటర్ చదువుతున్న 100 మంది బాలికలకు పబ్లిక్ పరీక్షలు వ్రాయడానికి అవసరమైన అట్టలు, పెన్నులు, స్కేల్లు , పౌచ్ లు వంటి స్టేషనరీ సామాగ్రిని గురువారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షల పట్ల భయం వీడాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ. రెడ్డి జ్యోతి, ఉపాధ్యాయునిలు, సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, ప్రతినిధులు పి. శ్రీనివాస రెడ్డి, యం. రాజా శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా కళాశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండల కోరవాండ్లపల్లెలోని కస్తూర్బా కళాశాలను గురువారం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకి విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పాటించి ఉన్నత స్థాయికి చేరుకోగలరని సూచించారు. విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కస్తూర్బా కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు కూడా మంచి భోజనం, వసతి మంచిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని వాటిని విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు కస్తూర్బా పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు వసతులు కల్పించడంలో ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈవో సుజాత, గంగాధర్‌నాయక్, సర్పంచ్ గంగిరెడ్డి, అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బర్దన్ నగర్ ద్వితీయ వార్షికోత్సవ సభ



**బద్వేలుఅర్బన్ ,ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**
బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలం పి.పి.కుంట వద్ద బర్ధన్ నగర్ ద్వితీయ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సభలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ, 2024 ఫిబ్రవరి 5న గోపవరం మండలంలోని అర్హులైన పేదలతో కలిసి సిపిఐ ఆధ్వర్యంలో జెండా పాతి గుడిసెలు వేయించిన నాటి నుంచి అక్కడ నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇప్పటివరకు ఇంటి పట్టాలు, పక్కా ఇళ్లు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కొని అక్కడ నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ తక్షణమే ఇంటి పట్టాలు, పక్కా ఇళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో కడప జిల్లా వ్యాప్తంగా విస్తృత ఉద్యమాలు చేపడతామని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్, ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, సహాయ కార్యదర్శులు పి.వి.రమణ, ఇమ్మానియేల్, గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ, నాగరాజు, కమిటీ సభ్యులు పెంచలయ్య, వెంకటేశు, లక్ష్మమ్మ, సుప్రజ, రమాదేవి, బి.బి. తదితరులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక కొరకు వినతి పత్రం..

**సుండుపల్లె, ఫిబ్రవరి 05,ప్రభాతవార్త :**
మండల పరిధిలో ముడుంపాడు, మంచిరెడ్డిగారిపల్లి, పెద్దినేనికాల్వ, చిన్న గొల్లపల్లి, పొలిమేరపల్లి, రాయవరం జంగంపల్లి హిందూ స్మశాన వాటికలు కేటాయించాలని తహసీల్దార్ మహబూబ్ చాంద్ వినతి పత్రం.ఎస్టి ఎస్సి బీసీలు అనేకమంది భూమిలేని వారు వారి యొక్క పార్థివ దేహాన్ని వంకలలో చెరువులలో వేస్తున్నారు వారి యొక్క పూర్వీకుల ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి చాలామందికి భూమిలేని కారణంగా ప్రభుత్వ భూమి నందు ఆయా గ్రామాలలో హిందూ స్మశాన వాటికలు కేటాయిస్తే బడుగు బలహీనవర్గాలు పేద ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరుచున్నాము .ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి నాగ శంకరయ్య కార్యదర్శి నాగేశ్వరరావు బీజేవైఎం సుండుపల్లి మండలాధ్యక్షులు పెంచలయ్య బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

**కలికిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
కలికిరి-పీలేరు రోడ్డు మార్గంలోని తిమ్మారెడ్డి మాదిగపల్లి సమీపంలోని హైవే రోడ్డు మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అరుణకుమారి(32) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తిరుపతి పద్మావతి పార్క్ సమీపంలో నివాసం ఉన్న అరుణకుమారి తన భర్త హరికృష్ణలు సీటీఎం పంచాయతీ గౌడసానపల్లికి సీటీఎంలో జరుగుతున్న గంగమ్మ జాతరకు గత 3 రోజుల క్రితం వచ్చారు. బుధవారం జాతర చూసుకొని తమ ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళ్తుండగా వెనకవైపు నుంచి మదనపల్లి నుంచి తిరుపతికి వెళ్లే కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో మహిళ అరుణకుమారికి బలమైన రక్తగాయాలు తగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. అరుణకుమారి భర్తకు బలమైన రక్తగాయాలు తగిలాయి. వెంటనే హైవే అథారిటీ అధికారులు రక్తగాయాలైన హరికృష్ణను పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని కలికిరి ఏఎస్సై నరసింహులు సందర్శించ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసి వివరాలు సేకరిస్తున్నారు. కలికిరి సీఐ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో ఏఎస్సై నరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిపిఎమ్ఓగా రమేష్ బాబు నియామకం

**మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**
డిస్టిక్ ప్రోగ్రాం మేనేజ్మెంట్ ఆఫీసర్ ( డిపిఎమ్ఓ ) గా డాక్టర్ రమేష్ బాబును నియమిస్తూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. నిమ్మనపల్లి వైద్యాధికారిగా ఉన్న డాక్టర్ రమేష్ బాబును డీపీఎంవో, స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర జిల్లా కోఆర్డినేటర్ గా నియమిస్తూ గురువారం డి ఎం అండ్ హెచ్ ఓ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మదనపల్లె పిపి యూనిట్ వైద్యాధికారిగా ఉన్న డాక్టర్ శ్రీధర్ ను జిల్లా సర్వలెన్స్ అధికారిగా నియమించారు. డి ఎం అండ్ హెచ్ వో ఆదేశాల మేరకు వీరిద్దరూ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## పలువురు సహకారంతో కోదండ రామాలయం నిర్మాణం



**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 05 ప్రభాతవార్త :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధి రెండవ వార్డు జాంబవంత నగర్లో నివాసం ఉంటున్న మున్సిపల్ కార్మికులు ప్రాంతంలో శ్రీ కోదండరామస్వామి దేవాలయం పునర్నిర్మాణం మరియు విగ్ర ప్రతిష్టకు పలువురు దాతలు ముందుకు రావడం ఎంతో సంతోషకరమని రామాలయం కమిటీ సభ్యులు వ్నల్లకొండు వెంకటరమణ, కె.వి సుబ్బారావు,చెన్నంపల్లి రామకోటి రాజు, పెద్ది సుధాకర్, పబ్బతి చంద్రశేఖర్ బ్రహ్మదేవుని యర్రం రెడ్డి,ఈగ సుబ్బారెడ్డి,బత్తల సునీల్ కుమార్, సి.వి నాగేశ్వరరావు, కామేశ్వరరావు, కాలువ నాగేంద్ర తోపాటు పలువురన్నారు, గురువారం ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డిని కలిసిన వెంటనే వారు 50, 116/ లు విరాళం ప్రకటించారు. అలాగే స్వామివారి విగ్రహాలు మరియు అవసరమైన దేవాలయానికి సంబంధించిన సామాగ్రికి దేవాదాయ శాఖ ఈవో రామలింగారెడ్డి అలాగే దేవాలయ ప్రాంగణంలో అవసరమైన రెవెన్యూ సర్టిఫికెట్ కోసం బద్వేల్ తహసిల్దార్ ఉదయభాస్కర్ రాజును పలువురు కమిటీ సభ్యులు కలిసి అవసరమైన అర్జీలను సమర్పించడం జరిగింది, స్పందించిన అధికారులు ఆలయానికి సంబంధించిన సర్టిఫికెట్ లను అందజేస్తామన్నారు. ఆలయ పనులు గురువారం పలువురు కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.

## పోరాటాలు నిర్వహిస్తున్న అభ్యర్థి చలసాని

**పులివెందుల, ఫిబ్రవరి 5 ప్రభాత వార్త :**
న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం పోరాటం చేస్తున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షులు చలసాని అజయ్ కుమార్‌కు జరగబోయే రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలిపించాలని నాయ కులు పిలుపునిచ్చారు. గురువారం పులివెందుల పట్టణంలోని కోర్టు ఆవరణలో ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ మారుతి రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల ఇళ్ల స్థలాల కేటాయింపు, జూనియర్ న్యాయవాదులకు స్టైపండ్ పెంపు వంటి కీలక అంశాలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న అభ్యర్థి చలసాని అజయ్ కుమార్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, పులివెందుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తులసిరామ్, ఐఏఎల్ జిల్లా నాయకులు వెంకటరమణ, సుశీల్ కుమార్, న్యాయవాదులు హరినాథ్ రెడ్డి, కే. నరసింహారెడ్డి, ప్రకాష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నిద్రావస్థలో సచివాలయాలు

**పోరుమామిళ్ల రూరల్, జనవరి 5 ప్రభాతవార్త:**
ప్రతిరోజు సచివాలయాల్లో ప్రజలకు సంబంధించిన సర్టిఫికెట్ల కోసం, అప్డేట్ల కోసం సచివాలయాలకు వెళితే సచివాలయ సిబ్బంది మాకు సర్వేలు ఉన్నాయని, సర్వర్ పని చేయడం లేదని, ఇలా ఏదో ఒకటి సాకుతో చెబుతూ తమ కుర్చీల మీద కూర్చొని సెల్ ఫోన్లు చూసుకుంటూ టైంపాస్ చేస్తున్నారని ఆలిండియా హ్యూమన్ రైట్స్ చీఫ్ గంగన్న, సెక్రెటరీ ఫణి రావు, ఆఫీస్ సెక్రటరీ పూజ, ప్రెస్ సెక్రటరీ ప్రవీణ్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ సచివాల సిబ్బంది గవర్నమెంట్ ఏర్పాటు చేసిన మీ సేవ దగ్గరికి పోయి చేపించుకోండి అంటున్నారన్నారు. చూసి చూడనట్టు పోతున్న పై అధికారులు ప్రజలకు అసౌకర్యం కలగకుండా సౌకర్యమంతమైన పరిపాలన ఇవ్వాలని ప్రభుత్వాలు చెప్తుంటే సచివాలయ సిబ్బంది మాత్రం మాకేంటి అనే విధంగా సిబ్బంది ఉన్నారన్నారు. తక్షణమే సచివాలయ సిబ్బందిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

**పేరు మార్చడమైనది**
కడప జిల్లా రాజంపేట మండలం మన్నూరు గ్రామం, డోర్ నెంబర్ 9/137, 516126, ఏపీ. లో నివాసం ఉంటున్న గుగ్గుల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి కుమారుడు GUGULA YOGIESWAR REDDY పాస్పోర్ట్ (G686203) ప్రకారం అనే పేరు ఉంది. ఈ నా పేరును ఆధార్ కార్డు(5932 9667 4505) ప్రకారం 'గుగ్గుల యోగీశ్వర్ రెడ్డి S/o గుగ్గుల రాజేంద్రప్రసాద్‌రెడ్డిగా' మార్చుకోవడం జరిగిందని ఇందుమూలంగా తెలియజేస్తున్నాను.

# రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

పోతిరెడ్డిపాడు, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై చంద్రబాబు నాయుడు అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛలో పోతిరెడ్డిపాడు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సాగు, త్రాగునీటి అవసరాల కోసం ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అలాగే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీమ ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటిమట్టం చేరకముందే నీటిని తరలిస్తున్న పరిస్థితుల్లో, వాటిని అరికట్టడంతో పాటు రాయలసీమ ప్రజలకు సాగు, త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని తీసుకువచ్చారని ఆయన చెప్పారు. అయితే సీమ ప్రజలకు రావాల్సిన 22 టీఎంసీల నీటిని అడ్డుకునేలా చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి కాకపోతే సీమ ప్రాంతం తీవ్ర కరువుతో అల్లాడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. సీమకు న్యాయం జరగాలంటే ఈ పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ రైతుల హక్కుల కోసం, నీటి న్యాయం కోసం వైయస్ఆర్‌సీపీ అచంచలంగా పోరాటం చేస్తుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి స్పష్టం చేశారు.



## కార్మికుడికి తీవ్ర గాయాలు

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



పట్టణంలోని సి.టి.ఎమ్ రోడ్డులోగల వెల్డింగ్ షాపులో పనుల్లో నిమగ్నమై ఉన్న ఓ వెల్డర్ కాలిపై కట్టర్ పడటంతో గాయాలయ్యాయి. మండల పరిధిలోని దండువారిపల్లి గ్రామానికి చెందిన ఖాదరవల్లి (40) సి.టి.ఎమ్. రోడ్డులోని ఎస్టేట్ ప్రాంతంలో ఉన్న ఒక వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. కట్టర్ మిషన్ సహాయంతో ఐరన్ కమ్మిలను కత్తిరిస్తుండగా, ఒక్కసారిగా కట్టర్ అదుపు తప్పి అతని కాలిపై పడింది. ఈ ప్రమాదంలో కాలు తీవ్రంగా తెగి రక్తస్రావం కావడంతో ఖాదరవల్లి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు బాధితుడిని చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



పిటిఎం మండలంలోని పులికల్లు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. జింకల గుంపు ఒక్కసారిగా బైకుకు అడ్డం రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు పిటీఎం మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన వెంకటేష్ (45), రమణమ్మ (40) తమ సొంత పని నిమిత్తం మల్లెల గ్రామం నుండి మల్లెల క్రాస్ వైపు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వీరి వాహనం పులికల్లు ప్రాంతానికి చేరుకోగానే, సమీపంలోని పొదల నుండి జింకల గుంపు ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకువచ్చింది. అకస్మాత్తుగా అడ్డువచ్చిన జింకలను తప్పించబోయే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో రమణమ్మ, వెంకటేష్ ఇద్దరికీ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్పందించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## కోడి పందేళ్ళ స్థావరంపై మెరుపు దాడి

**-13మందిపై కేసు నమోదు**

**చౌడేపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**

కోడి పందేళ్ళ స్థావరంపై పోలీసులు మెరుపుదాడి చేసారు. దాడిలో పలువురు పందేగాళ్ళను అదుపులోకి తీసుకొన్నారు. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు మండలంలోని దిగువపల్లి పంచాయతీ బోయకొండ సమీపంలోని వికె రెసిడెన్సీ వెనుక భాగంలో కోడిపందేళ్ళు ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. మదనపల్లి డిఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరానుపయోగించి స్థావరంపై దాడి చేసారు. ఈ దాడిలో 13మందిని అదుపులోకి తీసుకొని రూ. 25 వేలు నగదు, 6కోళ్ళు, 11టూవీర్లను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మదనపల్లి డిఎస్పీ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరానుపయోగించి అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అదే విధంగా అక్కడే వున్న నాగరాజ వద్ద నాటుతుపాకీని స్వాధీన పరచుకొని అక్రమంగా ఆయుధం కల్గివున్నట్లుగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రజక భవనం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**



నియోజకవర్గ పరిధిలో రజక భవనం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు రజక సంఘం ఐక్యవేదిక అధ్యక్షులు చిన్నక్కగారి చెంద్రాయుడు రజక సభ్యులతో కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని, అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గంగయ్యను కలిసి ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నక్క గారి చెంద్రాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 15 వేల మంది రజకులను జీవనం కొనసాగిస్తున్నామని, రజక సంఘం ఐక్యవేదిక ఏర్పాటు చేసుకొని రజక భవనం నిర్మించాలన్న నిర్ణయంతో ఒక ఎకరా ప్రభుత్వం స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కృష్ణ, నాగరాజు, వెంకట్, శ్రీనివాసులు, సుబ్బారాయుడు, సుబ్బారావు, శేఖర్, నాగయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని ధ్వంసం చేస్తున్న ప్రభుత్వాలు

**ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధ్వంసం చేస్తున్నాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె. భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. గురువారం కడప నగరంలోని యుటిఎఫ్ భవనంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 2.6 శాతం మాత్రమే నిధులు కేటాయించడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10 శాతం, జీడీపీ లో 6 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ పాఠశాలల పోస్టుల నియామకాల్లో ఆర్జెడిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, అంకన్న, సునీల్, సహాయ కార్యదర్శులు రాజేష్, రాంబాబు, రాష్ట్ర నాయకులు వినోద్, నేతి నాగేశ్వర, షారుక్, అఖండ, రమణ, ఆశిర్, మానస, జిల్లా నాయకులు మనోజ్, మహేశ్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి అరాచకాలు సృష్టించడం దురదృష్టకరం

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**



గత ప్రభుత్వ పాలనలో అరాచకాలు సృష్టించిన వైసీపీ నాయకులు ప్రతిపక్షంలోనూ అదే పంథా కొనసాగించడం దురదృష్టకరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి మండిపడ్డారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్ మాజీ మంత్రి అంబటి రాంబాబు పరామర్శ పేరుతో 30 పోలీసు యాక్ట్‌ను ఉల్లంఘించారని, అక్కడ ప్రసంగంలో కూడా కులాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు మొదట ఎన్.డి.డి.బి రిపోర్ట్ ప్రకారం ఆరోపణలు చేశారని, సిట్ నివేదికలో కూడా వారికి వ్యతిరేకంగా వున్నా ప్రజలను తప్పుద్రోవ పట్టించాలను కోవడం దారుణమన్నారు. ప్రజలు నిజానిజాలు గుర్తించాలని తెలిపారు. స్థానిక వైసీపీ నాయకులు రెడ్ బుక్ పై విమర్శలు చేసే సమయంలో వారి పాలనలో టిడిపి నాయకులను ఇబ్బందులకు గురి చేస్తేనే రెడ్ బుక్ ఆవిర్భవించిందని గుర్తుంచుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టప్పా మహబూబ్ బాష, కూనపూరి రామునాయుడు పాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి ఏఎంసీ సహకారం

**పుంగనూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



ఏఎంసీ చైర్మన్ సెమీపతి యాదవ్, కార్యదర్శి గోపి అన్నమయ్య జిల్లా మదనపల్లి కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఎస్పీ కార్యాలయ భవన నిర్మాణానికి తమ వంతు సహాయాన్ని అందజేశారు. గురువారం మదనపల్లిలో ఈ సహాయాన్ని మదనపల్లి డీఎస్పీ మహేంద్రకు పుంగనూరు సీఐ సుబ్బరాయుడితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సెమీపతి యాదవ్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, అలాంటి శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకారం అందించడం గర్వంగా ఉందన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. సహాయం అందించిన ఏఎంసీ చైర్మన్ సెమీపతి యాదవ్, కార్యదర్శి గోపిలకు డీఎస్పీ మహేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ ఆస్థిపన్ను వసూళ్ళలో రాజంపేట టాఫ్

**ద్వితీయ స్థానంలో మదనపల్లె మున్సిపాలిటి**

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



2025-26వ సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ ఆస్థిపన్నుల వసూళ్ళలో ఇప్పటి వరకు రాజంపేట మున్సిపాలిటి 52.78శాతం వసూలు చేసి అన్నమయ్య జిల్లాలోనే టాప్‌గా నిలిచింది. మదనపల్లె సెలక్షన్‌గ్రేడ్ మున్సిపాలిటిలో 49.31శాతం ఆస్థిపన్నులు వసూలు చేసి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. రాజంపేట మున్సిపాటిలో 12,214 అసెస్‌మెంట్లు ఉండగా ఈ ఏడాదికి గానూ పన్నుల వసూళ్ళకు సంబంధించి రూ.7.83కోట్లు టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ.4.13కోట్లు వసూలు చేశారు. ఇక జిల్లాలోనే అతి పెద్ద మున్సిపాలిగా ఉన్న మదనపల్లెలో 28,721 అసెస్‌మెంట్లు ఉండగా రూ.27.10కోట్లు పన్నులు వసూలు చేయాల్సిన టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ.13.36కోట్లు వసూలు చేశారు. రాయచోటి మున్సిపాలిటిలో 29,861అసెస్‌మెంట్లు ఉండగా రూ.10.13కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు రూ.6కోట్లు వసూలు చేశారు. బి.కొత్తకోట మున్సిపాలిటిలో 7,917అసెస్‌మెంట్లు ఉండగా టార్గెట్ రూ.3.03కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు రూ.98లక్షలు వసూలు చేశారు. ఈ సందర్భంగా మదనపల్లె మున్సిపల్ కమీషనర్ ప్రమీల మాట్లాడుతూ మార్చి నెలాఖరులోపు ప్రభుత్వ లక్ష్యం మేరకు మదనపల్లె మున్సిపాలిటిలో ఆస్తిపన్ను, నీటిపన్ను వసూలు చేయడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటిలోని భవన యజమానుదారులు సకాలంలో ఆస్థిపన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. పాత బకాయిల వసూళ్ళకు కూడా ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తామని తెలిపారు.

## వైసిపి పాలనలోనే తిరుమల లడ్డులో కల్తీ

**జనసేన పార్టీ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి**

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వైసిపి పాలనలోనే తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి, మార్కెట్‌యార్డు చైర్మెన్ జంగాల శివరామ్‌లు తెలిపారు. గురువారం కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లసమావేశంలో వారు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడాలని, పరిరక్షించాలని మొట్టమొదటగా పిలుపునిచ్చింది జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటి సిఎం పవన్ కళ్యానే అన్నారు. పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని పవన్‌కళ్యాణ్ మాల ధరించి తిరుమలకు నడుచుకొని వెళ్లి అపరాధం మన్నించమని స్వామివారిని వేడుకోవడం జరిగిందన్నారు. సిట్ ఇచ్చిన నివేదికలో కొవ్వు కల్తీ లేదని పేర్కొన్నట్లు వైసిపి నాయకులు చెప్పుకొంటున్నారే తప్పా ఇంతవరకు సిట్ కల్తీపై సమగ్ర నివేదికలు ఇవ్వలేదన్నారు. వైకాపా పాలనలో చేసిన పాపాలను నాయకులు తప్పించుకోలేరన్నారు. వెంకటేశ్వరస్వామి వారిని శిక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ గడ్డం లక్ష్మీపతి, రూరల్ అధ్యక్షులు బాబు, పట్టణ అధ్యక్షులు నాయిని జగదీష్, రాజారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగించకుండా ట్రాఫిక్ నిబంధనలు ఏంటి

**సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు**

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

రోడ్డు ఆక్రమణలు తొలగించకుండా ట్రాఫిక్ నిబంధనలు ఎవరికోసమంటూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ట్రాఫిక్ నిబంధనలు రద్దు చేయాలని, ఆర్టీసి బస్సులను యదావిధిగా నడపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన పట్టణంలో అధిక వాహనాల రద్దీతో ప్రజలు రాకపోకలతో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి రోడ్లు వెడల్పు చేసి ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయడం ద్వారా సమస్యలు పరిష్కరిస్తారనుకుంటే ట్రాఫిక్‌సమస్య పట్టించుకోకుండా వన్‌వే ఏర్పాటు చేయడంత ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోని రోడ్లన్నీ పూర్తిగా ఆక్రమణలకు గురికావడం వల్లే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల పనివేళల్లో పట్టణమంతా ట్రాఫిక్ రద్దీతో ఉంటుందన్నారు. పట్టణంలోని వారపుసంతను బయటకు తరలించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగరాజ, నరసింహులు పాల్గొన్నారు.

## వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు కౌన్సెలింగ్

**ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వన్‌టౌన్ సీఐ టీవీ కొండారెడ్డి గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లైసెన్సులు లేని మైనర్ అబ్బాయిలను వారి మోటారు సైకిళ్లను స్టేషన్‌లో ఉంచి వారికి కౌన్సెలింగ్ చేశారు.

## రాజకీయాల కోసమే ఆగిన లిఫ్ట్ ఇరిగేషన్

**వైసిపి సమన్వయ కర్త నిస్సార్‌అహ్మద్**

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



విలేకర్లతో మాట్లాడుతున్న దృశ్యం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన స్వార్థ రాజకీయాల కోసమే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఆగ్రహం చెందుతున్నారని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ తెలిపారు. గురువారం వైకాపా అధిష్టాన పిలుపు మేరకు చలో పోతిరెడ్డి పాడు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాయాంలోనే రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వ్యవసాయరంగం అంటేనే చిన్నచూపు అని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి రాయలసీమకే కాదు రాష్ట్రానికే తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాయలసీమతో పాటు నెల్లూరుకు పోతిరెడ్డిపాడు ప్రాణవాయువు అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేస్తూ సాగు, తాగునీరు అందించకుండా తెలంగాణ ముఖ్యమంత్రికి మేలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు.

## కంటి అద్దాలు పంపిణీ

**చాపాడు. ఫిబ్రవరి 5.ప్రభాతవార్త :**



మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతో పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల యందు చదివే సుమారు 100 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపంతో పాటు, కంటి సమస్యలకు సంబంధించి ఈఅద్దాలు ఉపయోగపడతాయని డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రమోళి, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, చాపాడు టిడిపి నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి, పాఠశాల ప్రత్యేక అధికారిని, నాగలక్ష్మి, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ రూములు వేలం

**యర్రగుంట్ల ఫిబ్రవరి 5, ప్రభాత వార్త:**

యర్రగుంట్ల పురపాలక సంఘానికి చెందిన 2 అద్దె రూములను నెలసరి బాడుగపై లీజుకు ఇవ్వడానికి ఈనెల 12న వేలం నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పురపాలక కమిషనర్ శేషఫణి గురువారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ప్రవేశ రుసుం రూ.1000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## మిల్లర్ల అక్రమాలపై కఠిన చర్యలు

**గాలివీడు, జనవరి 5(ప్రభాతవార్త):**



మండలంలోని వివిధ రకాల రైస్, నూనె గింజల మిల్లర్ల యజమానులు అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని జిల్లా మార్కెటింగ్ అధికారి ఏడీ త్యాగరాజు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని రైస్‌మిల్లులు, నూనెగింజల మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లర్ల యజమానులతో మాట్లాడిన ఆయన ప్రతి నెలా అమ్మకాలు కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా మార్కెటింగ్ కార్యదర్శికి అందజేయాలని సూచించారు. అలాగే సంవత్సర కాలంలో జరిగిన లావాదేవీలకు సంబంధించి మార్కెట్ సెస్సును విధి విధానాల ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సెస్సు చెల్లించని పక్షంలో మార్కెట్ సరుకు విలువ ఆదారంగా సెస్సును శాఖే నిర్ణయించి విధించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే సెస్సు చెల్లించని మిల్లర్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఏడు రోజులలోపు తగిన ఆధారాలతో వివరణ సమర్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మార్కెటింగ్ కార్యదర్శి రమణమ్మతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

**రామసముద్రం ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**



జీవనోపాధి కోసం వలస లు వెళ్ళే పేద ప్రజలకు తమ గ్రామ పరిధిలోనే ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనె ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నేడు బిజెపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చెయ్యాలని కుట్ర చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఎపి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా రఘువీరారెడ్డి గురువారం రామసముద్రానికి విచ్చేసారు. మండలంలోని బల్లసముద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గురించి అమెరికా లాంటి దేశాలు కూడా భారత్ వచ్చి చూసి మెచ్చుకున్నారు. మహాత్మా గాంధీని ఒక గాడ్సే ఎలా అయితే హత్య చేసాడో అలాగే మహాత్మా గాంధీ పేరు ఉన్న ఈ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం హత్య చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మురళీమోహన్ యాదవ్, నందకుమార్ యాదవ్, రెడ్డి సాహెబ్, ఖాదర్ భాషా, మహబూబ్ పీర్, శరత్ కుమార్, వాళీ, రెడ్డి బలసంద్రం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయాల తనిఖీ

**రామసముద్రం పిబ్రవరి 5 ప్రభాతవార్త**



మండలం ఆర్ నడింపల్లె, కమ్మవారిపల్లె గ్రామ సచివాలయాలను ఎంపీడీవో ఎస్ ఏ గపూర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌తో పాటు ఇతర రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. సిబ్బంది విధులకు సమయపాలన పాటించాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థంగా అందేలా చూడాలని సూచించారు. అనంతరం కమ్మవారిపల్లె గ్రామ పంచాయతీలోని ఎర్రబోయినపల్లె గ్రామంలో ఇంటి పన్నుల వసూలు ఇంటి పన్నులు పంచాయతీ కార్యదర్శి నాగరాజ నిర్వహిస్తుండగా డిప్యూటీ ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ పంచాయతీ కార్యదర్శులు సాకమ్మ, రాజశేఖర్ టిడిపి నాయకులు నడింపల్లె రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## తాళ్లపాకలో కెనరా బ్యాంక్ ఎటిఎం

**రాజంపేట,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**

పద కవితా పితామహుడు అన్నమాచార్యుని జన్మస్థలి తాళ్లపాకలో కెనరా బ్యాంక్ ఎటిఎం,సి.డి.యం. మెషిన్ లను ను బ్యాంక్ ఎజిఎం అరుణ జ్యోతి గురువారం ప్రారంభించారు.సి.ఎస్.ఆర్. యాక్టివిటీ కింద తాళ్లపాక గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన బాలికల మరుగు దొడ్లను కూడా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంతటి గొప్ప సహకారాన్ని అందించినందుకు కెనరా బ్యాంక్ ఏ.జీ.ఎం అరుణ జ్యోతికి డి.ఎం. రమేష్‌ను గ్రామస్తులు ,ఖాతాదారులు సన్మానించారు.

## ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో పారిశుధ్య కార్మిక సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్ సిబ్బంది P. F. బకాయిలు, E.S.I. కార్డ్స్ మంజూరు చేయని ఏజెన్సీలపై కార్మిక చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉప కార్మిక, సహాయ కార్మిక కమిషన్‌లకు గురువారం మాలమహానాడు,కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యాశాలలో ఏజెన్సీ ద్వారా ఆసుపత్రి నందు దాదాపుగా 15 మంది పారిశుధ్య కార్మికులుగా,10 మంది సెక్యూరిటీ గార్డ్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కార్మిక చట్ట ప్రకారం నిబంధనల పెరిగిన జీతాలు,పి.ఎఫ్. బకాయి డబ్బులు,ఈ.ఎస్.ఐ కార్డులు ఇంత వరకు పంపిణీ చేయించకపోవడం, వార్డుల సంఖ్య పెరగడం వలన సిబ్బందికి పని ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నా సిబ్బంది సంఖ్య పెంచక పొగా కనీసం కార్మిక చట్ట ప్రకారం సెలవులు మంజూరు చేయకపోవడం ఇలాంటి అనేక సమస్యలతో నరక యాతన అనుభవిస్తూ ప్రజలు ఇబ్బందులు పడకూడదని మానవతా దృక్పథంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీలపై విచారణ జరిపి వారి లైసెన్సులను రద్దుచేసి శాఖాపరమైన చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## యర్రగుంట్ల ఎస్సైగా రామాంజనేయులు

**యర్రగుంట్ల ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**

యర్రగుంట్ల ఎస్ఐ2గా రామాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కడప విఆర్‌లో ఉన్న ఈయన బదిలీపై యర్రగుంట్ల ఎస్సై 2 గా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, మద్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## వేరుశనగ విత్తనాలు పంపిణీపై విచారణ

**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



రబీ సీజన్ 2025, 26 సంవత్సరంలో పీలేరు మండలం రైతు సేవ కేంద్రాల్లో 100!! రాయితీకి పంపిణీ చేసిన వేరుశనగ విత్తన కాయలకు సంబంధించిన విచారణలో భాగంగా అన్నమయ్య జిల్లా వ్యవసాయ కార్యాలయం మదనపల్లి నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద్ అహ్మద్ పీలేరులోని అగ్రహారం ఎల్లలవారిపల్లి, బోడపల్లి హరిజనవాడ, గూడరేవుపల్లి హరిజన గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ రైతులకు అందజేసిన సబ్సిడీ విత్తన కాయలకు సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేసి అభ్యంతరాలు తెలియజేయమన్నారు. రైతులు విత్తనాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు విత్తనాన్ని సద్వినియోగం చేసుకొని సీజన్లలో విత్తనం కొ రకు టిసిజిఎస్ 1694 ఉపయోగించుకోవాలని కొత్త రకం విత్తనం అధిక దిగుబడినిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఓ. రమాదేవి ఏ.ఈ.ఓ నజీర్ రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షునిగా మునియాదవ్

**పులివెందుల ఫిబ్రవరి 5 ప్రభాత వార్త :**



హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా మేకల ముని యాదవ్ ఎన్నికయ్యారు. సంఘం జాతీయ చైర్మన్ నాదం నరసింహా రావు జారీ చేసిన నియామక ఉత్తర్వుల మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేకల ముని యాదవ్ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి వ్యక్తికి న్యాయం అందేలా పనిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలు తమ హక్కులను తెలుసుకొని కాపాడుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు సక్రమంగా అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ముని యాదవ్ పేర్కొన్నారు. కడప జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ మరింత క్రియాశీలకంగా పనిచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధి

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ః**



ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉన్న సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించడమే పరమావధిగా భావించాలని స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి సూచించారు. గురువారం ఆయన మండలంలోని సమస్యలపై ఆరా తీశారు. సచివాలయాల పరిధిలోని అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించి మారుమూల గ్రామాలలోని ప్రజల మన్ననలు పొందాలన్నారు. అధికారులు తమ విధి నిర్వహణ లో నిర్లక్ష్యం వహించరాదని సమస్యలపై ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి అధికారులు తెచ్చుకోరాదని సూచించారు. వేసవి దృశ్య గ్రామాలలో తాగునీటి సమస్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా కార్యదర్శులకు సూచనలు ఇవ్వాలని ఏవో థామస్ రాజాకు సూచనలు ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. ఆయనతో ఏవో థామస్ రాజా, టిడిపి నాయకుడు కాలా నారాయణ, జనసేన నరసింహులు, మాజీ సర్పంచ్ సుధాకర్, సలాది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి బీసీ సదస్సును జయప్రదం చేయాలి

**పులివెందుల ,ఫిబ్రవరి 5 , ప్రభాతవార్త :**



స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 8వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని బీసీ భవన్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి బీసీ సదస్సును విజయవంతం చేయాలని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ,స్థానిక బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని స్థానిక బీసీ కార్యాలయంలో సదస్సు ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడంతో వేలాది మంది బీసీలు ప్రజాప్రతినిధులుగా అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కులాల వారీగా సామాజిక-ఆర్థిక స్థితిగతులు, సంపద పంపిణీ, అవకాశాల అసమానతలపై స్పష్టమైన డేటా లేకపోవడం వల్ల బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, బీసీ నాయకులు దాసరి చంద్రమోళి, రాచకుంట శ్రీనివాసులు, అభ్యుదయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పం వాసు దేవాచారి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సిరి బాబుకు ప్రశంస

**లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 05 ప్రభాతవార్త**

పంచాయతీ కార్యదర్శి సిరి బాబుకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ ఉత్తమ కార్యదర్శిగా ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధి అధికారుల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటి పన్నులు 100 శాతం పూర్తి చేశారని, అంతేకాకుండా గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారని తడి పొడి చెత్త గ్రామ అభివృద్ధి శుభ్రత 100 శాతం పనులు పూర్తి చేశారని ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు సిరి బాబు తెలిపారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- ప్రభుత్వం తీరుపై షర్మిలారెడ్డి ధ్వజం

**కలికిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

దేశంలో జాతీయ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదని బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కేంద్రంలో ప్రధానమంత్రిగా మన్‌మోహన్‌సింగ్ ఉన్నప్పుడు రాష్ట్రంలో మొట్టమొదటిగా జాతీయ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి కోట్లాది మంది ప్రజలకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు తమ గ్రామాలలోనే పనులు చేసుకొని జీవనోపాధి పొందేవారన్నారు. మహిళలు పనులు చేసేప్పుడు సమాన వేతనం మహిళలకు కూడా అందించాలని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దృష్టికి మహిళలు తేగా మహిళలకు సమాన వేతనం ఇచ్చిన ఘనత వైఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు సేవలందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మహాత్మ గాంధీ పేరు మార్చడమే కాకుండా పథకాన్ని కూడా నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతున్నారన్నారు. గతంలో ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడమే కాకుండా రాష్ట్రాలకు 60 శాతం నిధులు ఇవ్వడం, 40 శాతం రాష్ట్ర నిధులు ఇచ్చే విధంగా బబీజేపీ ప్రభుత్వం పథకంలో పొందుపరచడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అసలే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేద్నారు. పార్లమెంటులో ఉపాధి హామీ పథకం బిల్లు ప్రవేశపెట్టినప్పుడు సీఎం చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపి ఉపాధి హామీ పథకానికి ద్రోహం చేశాడని షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా వైఎస్.షర్మిలారెడ్డి కలికిరి రావడంతో పీలేరు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావడంతో కలికరిలో ఉపాధి హామీ పర్యవేక్షణ యాత్ర విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# 8వ రోజు శ్రీశ్రీశ్రీ చాముండిదేవిగా పెద్దమ్మతల్లి

**మైదుకూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త :**



మైదుకూరు పట్టణ నంద్యాల రోడ్డు పాతూరులో వెలిసినటువంటి గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి 27వ వార్షికోత్సవం సందర్భంగా నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా 8వ రోజు శ్రీశ్రీశ్రీ చాముండి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు. చాముండేశ్వరి (చాముండి) దేవి హిందూ మతంలో శక్తి స్వరూపిణి, ఏడు మాతృకలలో (సప్తమాతృకలు) ఒకరు, ఈమె మహిషాసుర సంహారకురాలు, దుర్గాదేవి యొక్క ఉగ్ర రూపం, ఈమె చెడును అంతం చేసి భక్తులను కాపాడే దేవిగా కొలవబడుతుంది. చాముండేశ్వరి దేవి విశేషాలు, అవతారం: చండ, ముండ అనే రాక్షసులను సంహరించిన కారణంగా ఈమెకు ఖిచాముండిఖి అనే పేరు వచ్చింది. రేపు చివరి రోజు అమ్మవారు పెద్దమ్మ తల్లిగా భక్తులకు దర్శనమిస్తారు భారీ ఎత్తున మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి అలంకరించిన 9 చీరలను భక్తులు వేలంలో పాల్గొని దక్కించుకోవచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

# నానో టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ డా. షిహాబుద్దీన్



**రాజంపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**

ప్రయోగశాలలో జరిగే పరిశోధనలను వాస్తవ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మార్కెట్ ఉత్పత్తులుగా మార్చడం అత్యంత అవసరమని తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ షిహాబుద్దీన్ ఎం. మలియెక్కల్ పేర్కొన్నారు. నానో టెక్నాలజీ నీటి కాలుష్యం నియంత్రణ, వ్యర్థ నిర్వహణ, వ్యవసాయ స్థిరత్వం ప్రజా ఆరోగ్య సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలియజేశారు. అన్నమాచార్య యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థులకునానో టెక్నాలజీ ఆధారిత ఉత్పత్తులు,ప్రయోగశాల నుండి మార్కెట్ వరకు మార్గాలు" అనే అంశంపై ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీ ప్రాయోగిక వినియోగాలు, పరిశోధన ఫలితాలను మార్కెట్‌కు అనువైన ఉత్పత్తులుగా మలిచే విధానాలు, సస్టైనబుల్ అభివృద్ధిలో నానో సాంకేతికత పాత్రపై సమగ్ర అవగాహన కల్పించారు. బయోపెస్టిసైడ్లు మరియు సింథటిక్ ఎరువులను అడ్వాన్స్‌డ్ ఆక్సిడేషన్ ప్రాసెస్‌లు ద్వారా విచ్ఛిన్నం చేసి బయోఫర్టిలైజర్లుగా మార్చే విధానాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మనిషి జీవితంలోని అన్ని రంగాలు నీటిపై ఆధారపడి ఉన్నాయని గుర్తుచేస్తూ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికల ప్రకారం భారతదేశంలోని 70 శాతం పైగా నీటి వనరులు కాలుష్యానికి గురయ్యాయని చెప్పారు. భూగర్భ జలాల్లో యురేనియం కలుషితం ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. తాజా నీటి వనరులు వేగంగా తగ్గిపోతున్న నేపథ్యంలో 2019లో చెన్నైలో ఏర్పడిన తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఉదాహరణగా చూపిస్తూ పరిశ్రమలు మూతపడిన పరిస్థితులు, పాఠశాలలు పరిమిత సమయంతో నడవాల్సి వచ్చిన దృశ్యాలను వివరించారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే మలిన జలాల్లో కేవలం 27 శాతం మాత్రమే శుద్ధి చేయబడుతున్నదని తెలియజేస్తూ నీటి శుద్ధి సాంకేతికతల అత్యవసరతను వివరించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాలు భవిష్యత్ నీటి శుద్ధి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఈ సాయి బాబా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించడం, నూతన ఆవిష్కరణల వైపు దారి చూపించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ అధ్యాపక బృందం ఐఐటీ ప్రొఫెసర్ను ఘనంగా సన్మానించింది.

# పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



**రాజంపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. గురువారం రాజంపేట మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. లబ్ధిదారులకు 5,80,789ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్న వారే ప్రత్యక్ష దైవం అన్నారు. మంచి పని చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును గుర్తుంచుకోవాలని చమర్తి కోరారు. ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి సహాయం కోసం,,వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. అదే విధంగా అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనాన్నిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆర్థిక చేయూత అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి,నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు,మన్నూరు సొసైటీ చైర్మన్ ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు,కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు,టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రేవూరి నరసింహ,సొసైటీ డైరెక్టర్ బండారు రెడ్డి శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర కృషితోనే అద్భుత ఫలితాలు సాధ్యం

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

నిరంతర సాధన, కృషితోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలరని కడప జిల్లా డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్స్‌ను తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చిలో ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని, పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నదని తెలిపారు. యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్స్‌ను సమర్థంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.సుధాకర్, కె. జోజయ్య, ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ బద్వేలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 500 మందికి ఉచితంగా మోడల్ పేపర్స్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# వెలుగుస్కూల్‌లో సేవలు బేష్

ఏయిర్‌ఫోర్స్ కమాండర్ రాజేష్



వెలుగుస్కూల్‌లో ఏయిర్‌పోర్స్ కమాండర్

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో బుద్దిమాంద్యులకు, వృద్దులకు వెలుగు స్కూల్ యాజమాన్యం అందిస్తున్న సేవలు బేష్ అంటూ రిషివ్యాలీలో ఉంటున్న ఇండియన్ ఏయిర్‌పోర్స్ వింగ్ కమాండర్ రాజేష్ రసాల తెలిపారు. గురువారం ఆయన వెలుగుసంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను, వృద్దులను ప్రేమతో పలకరించి వెలుగుస్కూల్‌కు వంటపాత్రలను అందజేశారు. దివ్యాంగుల కోసం క్రిస్మస్ ట్రీని అందజేసి దాతృత్వాన్ని చాటుకొన్నారు. ప్రతి ఏడాది వెలుగు చిన్నారులకు, వృద్దులకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. అనంతరం వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ బాగ్యలక్ష్మి ఏయిర్‌పోర్స్ కమాండర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్‌స్వీటి, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది చిన్నారులు, వృద్దులు పాల్గొన్నారు.

# రాష్ట్రష స్థాయి క్రీడల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

- రెండు బంగారు పతకాలు సొంతం



**ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ క్రీడా మైదానంలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన 28వ రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025-26 పోటీలలో ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచారు. హైజంప్ విభాగంలో సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థి శివానంద అద్భుత ప్రదర్శనతో బంగారు పతకం సాధించగా, డిస్కస్ త్రోలో ఈసీఈ బ్రాంచ్‌కు చెందిన ఈశ్వర్ యశ్వంత్‌రెడ్డి అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకున్నారు. రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీలలో విజేతలుగా నిలిచి కళాశాలకు కీర్తి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి విజేతలైన విద్యార్థులు శివానంద (సీఎస్ఈ) ఈశ్వర్ యశ్వంత్‌రెడ్డి(ఈసీఈ), అలాగే పీడీ లీలా రాజేష్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో సాధించిన విజయాలు విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనకు నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన కళాశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సదుపాయాలు, శిక్షణ అందించేందుకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని, క్రీడలతో పాటు చదువులోనూ సమాన ప్రాధాన్యత ఇచ్చి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు.

# గరుడ వాహనంపై శ్రీ రంగనాథుడు

**పులివెందుల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**



పులివెందుల పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల కిటకిటలతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ రంగనాథ స్వామి వారు శ్రీదేవి, భూదేవి అమ్మవారులతో కలిసి గరుడ వాహనంపై ఆలయ ప్రాంగణంలోను, పరిసర వీధులలోను విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహన సేవ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల నినాదాలు, భజనలతో మార్మోగాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశం చెందారు. అదే విధంగా ఉదయం వేళ శ్రీ రంగనాథ స్వామి వారు శ్రీదేవి, భూదేవి అమ్మవారులతో కలిసి గ్రామ పర్యటన నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అరవీటి నారాయణరెడ్డి స్వామివారికి ప్రత్యేక ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో కె.వి. రమణ, ఆలయ కార్యవర్గ సభ్యులు, అర్చక స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశారు.

# స్పర్శ లేని మచ్చలు కుష్ఠు వ్యాధి కావచ్చు

డిప్యూటీ హెచ్.ఈ.ఓ. మహమ్మద్ రఫీ

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



శరీరంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు కనిపిస్తే అవి కుష్ఠు వ్యాధి లక్షణాలు అయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు మదనపల్లిలోని హోప్ మునిసిపల్ హైస్కూల్‌లో కుష్ఠువ్యాధి అవగాహన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు రెండు వారాల పాటు స్పర్శ కుష్ఠు వ్యాధి పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠువ్యాధిని గుర్తించి చికిత్సను అందిస్తాము అనే నినాదంతో ఈ ఏడాది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు రఫీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కుష్ఠు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించి, వ్యాధి రహిత సమాజం కోసం అందరూ కలిసి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎమ్. రఘు, వాణి, ఏ.ఎన్.ఎమ్. సోని, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సౌరశక్తితో పనిచేసే డ్యూయల్ కెమెరాల ఏర్పాటు

**గాలివీడు, జనవరి 5(ప్రభాతవార్త):**



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాలివీడు టౌన్‌లో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టినట్లు గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. ఈ క్రమంలో గాలివీడు టౌన్ చెక్కవాండ్లపల్లికి చెందిన దాత ఆర్యశంకర్ సహకారంతో గాలివీడు పట్టణంలోని రాయచోటి రోడ్డులో, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే క్రాస్‌రోడ్డు వద్ద రెండు సౌరశక్తితో పనిచేసే డ్యూయల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణ, అనుమానాస్పద కదలికలపై నిఘా మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. అలాగే నేరాల నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజాబద్రతకు సహకరిస్తూ పోలీసు శాఖకు సహాయం అందించిన దాతలకు ఈ సందర్భంగా పోలీసు శాఖ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**బద్వేలు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందిన బద్వేల్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.20,84,969/ విలువైన చెక్కులను ఈరోజు బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ రితీష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న ఆర్థిక సహాయం బాధితులకు ఒక భరోసాగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తమ బాధ్యతగా టీడీపీ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు వెంగళరెడ్డి ,మహబూబ్ బాషా, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అక్షర ఆంధ్ర ఉల్లాస్" ఆకస్మిక తనిఖీ

**సంబేపల్లి, ఫిబ్రవరి 5: ప్రభాతవార్త**

గురువారం సాయంత్రం సంబేపల్లి మండలం గుడియావాండ్లపల్లి లోని హరిజనవాడలో జరుగుతున్న అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ "అక్షర ఆంధ్ర ఉల్లాస్" కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జి సంఘం సభ్యులతో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం ఎప్పుడు ఏర్పాటు అయ్యింది, ఎంత కాలం నుండి అక్షర ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారు, కార్యక్రమాన్ని ఏ ఏ రోజులలో నిర్వహిస్తున్నారు, కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు ఎస్ హెచ్ జి గ్రూపులోని వారందరికీ చూపిస్తున్నారా లేదా, కార్యక్రమంలో ఎన్ని గంటల పాటు చదువుకుంటున్నారు వంటి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు అక్షరాస్యులుగా అయ్యేందుకు ఈ కార్యక్రమంలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో డిఆర్డిఏ మెప్మా వంటి శాఖల సమన్వయంతో 15 సంవత్సరాల పైబడిన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌జి లబ్ధిదారులు, ఆయాలు, వంట వండేవారు, వివిధ రకాల సహాయకులు, వివిధ కార్యాలయాల కాపల దారులు, తదితరులను అక్షరాస్యులుగా చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.



# అభిషేక ప్రియా మృత్యుంజయా...!

**చౌడేపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**



కోరివారి కొంగుబంగారం మృత్యువును జయించే శక్తినిచ్చే దేవదేవునికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక మృత్యుంజయేశ్వరాలయంలో ప్రధానార్చకుడు రాజశేకర్‌దీక్షితుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయాన్నే అభిషేకము, అలంకరణ గావించారు. మాఘమాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి పవిత్ర తీర్థప్రసాదాలందించారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**కురబలకోట ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవాలనిమీట్స్ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. గురువారం కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు మిట్స్ యూనివర్సిటీ యెన్ ఎస్ఎస్, ఎస్‌వీఐఎస్ చారిటబుల్ ట్రస్ట్, తిరుపతి మరియు మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరము కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో రిజిస్ట్రార్ డాక్టర్ డి. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రక్త దానము చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత మరియు అవసరం అన్నారు. రక్త దానం అనేది ఒకరి ప్రాణాలను రక్షించడంలో సహాయపడే గొప్పదానం. ఇదొక నిస్వార్థమైన చర్య, అందువల్ల రక్తదానం చేసేందుకు అర్హులైన వారి సంఖ్య చాలా తక్కువ ఉంటుంది అని అన్నారు. గణాంకాల ప్రకారం. మన దేశంలో ఆసుపత్రిలో చేరే ప్రతి ఏడుగురిలో ఒకరికి రక్తం అవసరం అవుతుంది. ప్రమాదాలు జరిగి ప్రాణాపాయ పరిస్థితులలో రక్తం అందుబాటులో లేక చాలామంది చనిపోతున్నారని, వాస్తవానికి రక్తదానం చేయడం వలన వారు వేరొకరికి ప్రాణం పోయడంలో సహా. విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని అన్నారు. సుమారు 120 మంది రక్త దానం చేసారు. ఈ కార్యక్రమము లో మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి బాల చంద్ర నాయుడు, డాక్టర్ హరివి కుమార్, మెడికల్ ఆఫీసర్, యూనివర్సిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చెన్నయ్య యెన్ఎస్ఎస్ ఆఫీసర్ పి.రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ

**నందలూరు ఫిబ్రవరి 05 ప్రభాతవార్త :**

పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలతో పాటు నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా వంట గదులను పరిశీలించిన ఆయన, అక్కడ తయారైన వంటకాలను రుచి చూసి భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనం నాణ్యతగా ఉందని పేర్కొంటూ వంట ఏజెన్సీ నిర్వాహకుడు పాలెం సాంబశివయ్యను అభినందించారు. విద్యార్థులతో మాట్లాడి చికెన్, గుడ్డు వంటి పోషకాహారం క్రమం తప్పకుండా అందుతున్నదీ లేనిదీ కూడా తెలుసుకున్నారు. పాఠశాలల్లోని మౌలిక వసతులు, భోజన మెనూ, ఆహార నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ పరిధిలో ఐసిడిఎస్, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం, చౌక ధరల దుకాణాలు, బాల బాలికల వసతి గృహాలు, పీఎం మాతృ వందన యోజన వంటి పథకాలను కమిషన్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. లోటుపాట్లు ఉన్న చోట తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మోహన్, ఆర్ఐ సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని వినతి

**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

పెండ్లిమర్రి మండలం కోరవాండ్లపల్లె గ్రామంలోని పాఠశాలలో ఉన్న 11కేవీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డికి గురువారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటరమణ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉందని తద్వారా విద్యార్థులు ఎక్కడ ప్రమాదానికి గురవుతారోనన్న భయం ఉందని గతంలో కూడా పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఉపయోగం లేదని ఇప్పటికైనా ప్రమాదం చోటు చేసుకోకముందే ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని ఆయన కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని ఆదేశించారు.





ప్రాంగణ ఎంపికలో 130 మంది కెఎస్ఆర్ఎం విద్యార్థులు స్థానిక కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో మేఘా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్, వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 4వ సంవత్సరం చదువుతున్న సివిల్(74), ఎలక్ట్రికల్ (18), మెకానికల్ (38), మొత్తం 130 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఓ ప్రకటనలో కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కందుల గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైస్ చైర్మన్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఫలితానికి కారణమైన బోధనా సిబ్బంది, ట్రైనింగ్ ప్లేస్మెంట్ టీమ్ సభ్యుల అంకితభావాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో అధ్యాపకుల చేసిన నిరంతర కృషి ప్రశంసనీయం అని తెలిపారు. ఈ విజయంతో కెఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాలు పరిశ్రమలతో ఉన్న బలమైన అనుసంధానం మరోసారి నిరూపితమైంది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో డీన్ ఇండస్ట్రీ రిలేషన్స్ శ్రీ వేణుగోపాల్, డీన్ ప్లేస్మెంట్ ట్రైనింగ్ నాగరాజు వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.